www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 సెప్టెంబరు 2025
5
ఏలూరు

నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో సెప్టెంబరు 29వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం https://meekosam.ap.gov.in ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100కు కాల్ చేయవచ్చని తెలిపారు.

పిహెచ్‌సి వైద్యుల పోరుబాట

సమస్యల పరిష్కారం కోసం సమ్మెలోకి

ప్రభుత్వం హామీలను అమలు చేయకపోవడంపై ఆగ్రహం

ఇన్‌సర్వీస్ పీజీ కోటా నుంచి అనేక సమస్యలు పెండింగ్

ఏజెన్సీ పిహెచ్‌సిల్లో వైద్యులకు అందని అలవెన్స్

రెండు జిల్లాల్లో 240 మందికిపైగా పిహెచ్‌సి వైద్యులు

నేడు అన్ని పిహెచ్‌సిల్లోనూ ఓపి సేవలు నిలుపుదల

పిజి ఇన్‌సర్వీస్ కోటా తగ్గింపుపై గత ఏడాది ఏలూరు డిఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఆందోళన చేసిన పిహెచ్‌సి వైద్యులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పిహెచ్‌సి వైద్యుల పట్ల ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం అందించే వైద్యుల సమస్యలపై ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పేదలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్యం అందించే వైద్యుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోంది. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) వైద్యులు పోరుబాట పట్టారు. దీర్ఘకాలంగా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్న సమస్యల పరిష్కారం కోసం పిహెచ్‌సి వైద్యులంతా సమ్మెకు దిగారు. డిఎంహెచ్ఒ, జిల్లా కలెక్టర్‌కు సమ్మె నోటీసు ఇచ్చి ముందుకు సాగుతున్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి రెండు జిల్లాల్లోని పిహెచ్‌సిల వైద్యులు ఆందోళన సాగిస్తున్నారు. ఆన్‌లైన్ రిపోర్టింగ్, 104 సేవలు నిలుపుదల, జిల్లా అధికారుల గ్రూపుల నుంచి బయటికి రావడం వంటి కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టగా సోమవారం అన్ని పిహెచ్‌సిల్లోనూ ఎమర్జెన్సీ సేవలు మినహా మిగిలిన ఓపి సేవలను బహిష్కరించే కార్యక్రమానికి పిలుపునిచ్చారు. తర్వాత ఏలూరు, విజయవాడలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఏలూరు జిల్లాలో 62 పిహెచ్‌సిలు ఉండగా 110 పది మందికిపైగా వైద్యులు ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 41 పిహెచ్‌సిలు ఉండగా దాదాపు 80 మందికిపైగా వైద్యులు ఉన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నేపథ్యంలో గత్యంతరం లేని పరిస్థితుల్లో వారంతా సమ్మెకు దిగారు.

డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె

డాక్టర్ జి.గంగాభవాని,
ఎపి పిహెచ్‌సి వైద్యుల అసోసియేషన్ అధ్యక్షులు, ఏలూరు జిల్లా

పిహెచ్‌సి వైద్యుల సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుంది. జిల్లా కలెక్టర్, డిఎంహెచ్ఒకు ఇప్పటికే సమ్మెకు సంబంధించిన నోటీసులు ఇచ్చాం. ఓపి సేవల బహిష్కరణతోపాటు ఏలూరు, విజయవాడలో ఆందోళనా కార్యక్రమాలు కొనసాగుతాయి. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం.

పిహెచ్‌సి వైద్యుల డిమాండ్లు ఇవే..

పీజీ సీట్లలో పిహెచ్‌సి వైద్యులకు గతంలో 30 శాతం సీట్లు కేటాయించేవారు. గతేడాది 85 జిఒ తెచ్చి పీజీ సీట్లను ప్రభుత్వం 15 శాతానికి తగ్గించింది. దీంతో పిహెచ్‌సి వైద్యులంతా ఆందోళనబాట పట్టారు. దీంతో చర్చలు జరిపిన ప్రభుత్వం 20 శాతం కేటాయిస్తున్నట్లు పేర్కొంది. అంతేకాకుండా పిహెచ్‌సి వైద్యుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇప్పటి వరకూ ఏఒక్క హామీనీ అమలు చేయకపోగా ఈ ఏడాది పీజీ సీట్లను మళ్లీ 15 శాతానికి తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది గ్రామీణ ప్రజలకు సేవలందిస్తున్న పిహెచ్‌సి వైద్యులకు అన్యాయం చేయడమేనని చెప్పొచ్చు. అంతేకాకుండా పిహెచ్‌సి వైద్యులుగా చేరిన వారికి ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో ఉద్యోగ విరమణ వరకూ అదేవిధంగా ఉండిపోతున్నారు. దీంతో టైమ్‌బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని వారు కోరుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో పని చేసే పిహెచ్‌సి వైద్యులకు బేసిక్ పేపై 50 శాతం అలవెన్స్ ఇవ్వాలని వైద్యులు ఎప్పటి నుంచో అడుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమం కింద వైద్యులకు రూ.ఐదు వేలు అలవెన్స్, నేటివిటి, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యల పరిష్కారంతోపాటు పిహెచ్‌సి వైద్యులకు కచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవులు, జాబ్‌చార్ట్, అనుకూలమైన పని వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అనధికార వ్యక్తులు పిహెచ్‌సిలను విచ్చలవిడిగా ఇన్‌స్పెక్షన్ చేయకుండా నిబంధనలు విధించాలని పిహెచ్‌సి వెద్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే పిహెచ్‌సి వైద్యులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించకపోతే గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది.

నిలకడగా గోదావరి వరద

ముంపులోనే గుండేటి, పాలవాగు కాజ్‌వేలు

35 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

మూడు రోజులుగా పెరుగుతూ ముంపు మండలాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన గోదావరి వరద ఆదివారం నిలకడగా ఉంది. భద్రాచలంలో శనివారం 45 అడుగులుగా ఉన్న గోదావరి నీటిమట్టం ఆదివారం నాటికి స్వల్పంగా తగ్గి 42.7 అడుగులకు చేరుకుంది. మళ్లీ సాయంత్రానికి 43 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. భద్రాచలంలో గోదావరి నీటిమట్టం తగ్గుతూ, పెరుగుతూ, తగ్గుతూ దోబూచులాడుతోంది. మండలంలో వరద ఏమాత్రం తగ్గకుండా నిలకడగా ఉంది. ఇప్పటికే మూడు రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు, ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్‌వేలు ముంపులోనే ఉన్నాయి. దీంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. గతంలో 42 అడుగులకు గోదావరి వరద చేరుకున్నా పంట పొలాల్లో గోదావరి వరద ప్రవేశించేది కాదు. ప్రస్తుతం 40 అడుగులకే పంట పొలాల్లో గోదావరి వరద నీరు తిష్ట వేసింది. దీనికి పోలవరం కాపర్ డ్యామ్ ప్రభావమేనని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదేమైనా గోదావరి వరద తగ్గితే మండలంలోని మిర్చి సాగు చేసిన రైతులకు కొంత ఉపశమనం దక్కే అవకాశం ఉంది.

వేలేరుపాడు రూరల్: గోదావరి ఉధృతికి నీట మునిగిన రహదారి

పోలవరం వద్ద గోదావరి పరవళ్లు

వేలేరుపాడు రూరల్: మండలంలో గోదావరి వరద నిలకడగా ఉంది. వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో శుద్ధ గుంపు వద్ద ఉన్న పల్లపు ప్రాంతంలో వరద నీరు చేరడంతో కొత్తూరు, బోళ్లపల్లి, చిగురుమామిడి, ఎడవల్లి తదితర సుమారు 20 గ్రామాలకు రాకపోకల నిలిచిపోయాయి. వేలేరుపాడు నుంచి రుద్రంకోట, రేపాక గొమ్ము వెళ్లే ప్రజలు బోటుపై రాకపోకలు సాగిస్తున్నారు.

పోలవరం నుండి 9,41,673 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం: ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు మూడు రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి నిలకడగా మారింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 9,41,673 క్యూసెక్కుల జలాలను అధికారులు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 32.400 మీటర్లు, స్పిల్వే దిగువన 24.900 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 33.180 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 23.470 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 12 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

ఏలూరులో ఆరా క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక రామచంద్రరావుపేటలో నూతనంగా ఏర్పాటుచేసిన చిన్నపిల్లలు, చర్మవ్యాధుల ఆసుపత్రి ఆరా క్లినిక్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకుని రోగులకు మెరుగైన సేవలందించాలని ఆసుపత్రి వైద్యులు కొలుసు కళ్యాణ్, డాక్టర్ దివ్యలకు సూచించారు. అదే సమయంలో ఆసుపత్రికి వచ్చే పేద రోగుల పట్ల సానుకూల దృక్పథంతో చికిత్స అందించాలని, వైద్య వృత్తికి వన్నె తెచ్చే విధంగా వైద్య సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని మంత్రి పార్థసారథి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బి.ఉదయలక్ష్మి, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి రమణకుమార్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ యాదవ్ పాల్గొన్నారు.



క్లినిక్ ప్రారంభిస్తున్న మంత్రి

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే కూటమి లక్ష్యం

ఏలూరు ఎంపీ, ఉంగుటూరు ఎంఎల్ఎ, ఆప్కాబ్ ఛైర్మన్

ప్రజాశక్తి - భీమడోలు

ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఎన్‌డిఎ ప్రభుత్వం పని చేస్తుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. భీమడోలు మండలంలోని గుండుగొలనులో వీరు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా రూ.70 లక్షల ఉపాధి హామీ నిధులతో బిసి కాలనీలో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లకు, రూ.45 లక్షల ఉపాధి నిధులతో గృహ నిర్మాణ సంస్థ కాలనీలో నిర్మిస్తున్న అంతర్గత రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, గుండుగొలను సొసైటీ అధ్యక్షులు శ్రీ సిరిబత్తిన కొండబాబు, భీమడోలు మార్కెట్ కమిటీ ఛైర్మన్ గిరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ

యుపిఎస్‌సి ఫెలోషిప్‌కు ఆర్‌జియుకెటి విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నాలుగు క్యాంపస్‌ల నుంచి మొత్తం 27 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక కోనం యుపిఎస్‌సి ఫెలోషిప్ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారు. కోనం ఫౌండేషన్ స్థాపకుడు కోనం సందీప్ ఆర్‌జియుకెటి పూర్వ విద్యార్థి కావడం గర్వకారణం. గత నెల నిర్వహించిన ఈ పరీక్షలో రెండు, మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులు 266 మంది పాల్గొన్నారు. కఠినమైన ఎంపిక ప్రక్రియ అనంతరం 27 మంది విజేతలయ్యారు. వీరిలో ఏడుగురు నూజివీడు, తొమ్మిది మంది ఆర్‌కే వ్యాలీ, ఏడుగురు ఒంగోలు, నలుగురు శ్రీకాకుళం క్యాంపస్‌లకు చెందినవారు. ఎంపికైన విద్యార్థులకు యుపిఎస్‌సి పోటీ పరీక్షలకు కావాల్సిన శిక్షణ, మార్గదర్శకత్వం, వనరులు ఉచితంగా అందిస్తాను. దీని ద్వారా గ్రామీణ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉన్నత స్థాయి శిక్షణ లభించే అరుదైన అవకాశం లభించింది. ఈ కార్యక్రమాన్ని ఆర్‌జియుకెటి పూర్వ విద్యార్థులు శ్రీ హర్షిత్ రాజం, శ్రీ కోనం సందీప్ కృషికి కృతజ్ఞతగా పేర్కొంది. వారు తమ ఆల్మా మేటర్‌కు తిరిగి సహాయం చేసి, ప్రస్తుత, భవిష్యత్తు తరాల విద్యార్థులకు విజయ పథాలు సృష్టించారు. ఈ విజయోత్సవం ఆర్‌జియుకెటి విద్యార్థుల ప్రతిభ, కృషి, పట్టుదలను ప్రతిబింబించడమే కాకుండా దేశ సేవ చేయగల నాయకులను తీర్చిదిద్దడంలో విశ్వవిద్యాలయం కట్టుబాటును కూడా చూపిస్తుంది. దీంతో ఆర్‌జియుకెటి విద్య, అవకాశాలు, సామాజిక బాధ్యతల కేంద్రంగా మరింత పేరు తెచ్చుకుంది. యుపిఎస్‌సి ఫెలోషిప్‌నకు ఎంపికైన విద్యార్థులకు విశ్వవిద్యాలయ కులపతి ఆచార్య మధుమూర్తి, ఉపకులపతి ఆచార్య విజయ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-2002లో పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులంతా ఒక చోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. గత స్మృతులను, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పదో తరగతి ఉత్తీర్ణత అయి 24 సంవత్సరాలు తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం తో పాటు విద్యార్థులంతా ఇలా కలుసుకోవడం వల్ల స్నేహాలు బలపడతాయని తెలిపారు.అనంతరం అప్పటి ఉపాధ్యాయులను కలుసుకొని వారిని మెమెంటో, శాలువ లతో సన్మానించినట్లు తెలిపారు.అప్పటి ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..

జీలుగుమిల్లిలో..



కుక్కునూరులో...

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని జెడ్‌పి హైస్కూల్‌లో 2015లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 2015లో బోధన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులందరూ హాజరై, విద్యార్థులతో కలిసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పదేళ్ల తర్వాత విద్యార్థులను కలవడం ఆనందదాయకంగా ఉందన్నారు. వారు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడం గర్వకారణమని తెలిపారు. తమ విద్యార్థులు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తాము ఎల్లప్పుడూ తల్లిదండ్రులవలె సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు కూడా ఉపాధ్యాయుల మార్గదర్శనం, సహకారం తమకు ఎప్పటికీ కావాలని కోరుకున్నారు. ఈ హృద్యమైన కార్యక్రమంలో 2015 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని, సమ్మేళనాన్ని స్మరణీయం చేశారు.

వైరస్‌ల ధాటికి రొయ్య రైతు విలవిల

ప్రజాశక్తి - భీమవరం

వేంద్ర గ్రామానికి చెందిన ఒక రైతు మూడెకరాల్లో ఆక్వా సాగు చేపట్టి సీడ్ వేశారు. నెల రోజులు గడవక ముందే చెరువుకు వైరస్ సోకింది. రొయ్యలు నీటిపై తేలడం చూసిన రైతు పట్టుబడి పట్టేశారు. ఎకరానికి రూ.2.50 లక్షల చొప్పున రూ.7.50 లక్షలు నష్టం వాటిల్లింది. ఇక చేసేదేమీ లేక సాగు చేయకుండా వదిలేశారు.

మోగల్లుకు చెందిన మరో రైతు మూడున్నర ఎకరాల్లో సాగు చేయగా వైట్‌స్పాట్ వైరస్ సోకి చెరువులోని రొయ్యలు రాత్రికి రాత్రి పెద్దసంఖ్యలో తేలిపోయాయి. చెరువు దగ్గరకు ఉదయం వెళ్లి చూసిన రైతు బరువెక్కిన గుండెతో కంటతడి పెట్టుకున్నాడు. కేవలం సీడ్ వేసిన 40 రోజుల్లోనే ఇలా జరగడంతో చేసేదేమీ లేక పట్టుబడి పట్టాల్సి వచ్చింది. సుమారు రూ.10 లక్షల వరకు నష్టపోయాడు. ఇక సాగు చేయకూడదని నిర్ణయించుకుని చెరువు ఖాళీగా వదిలేశారు.

పెన్నాడ అగ్రహారానికి చెందిన ఇంకో రైతు రెండెకరాల్లో సాగు చేపట్టి 60 రోజులు గడిచాక పంట బాగుందని ఆనందంగా ఉన్న సమయంలో ఉన్నట్టుండి రాత్రికి రాత్రి చెరువు మొత్తం వైరస్ ధాటికి తిరగబడింది. మరో 25 రోజుల్లో పంట చేతికొచ్చే సమయానికి రొయ్యలు మృత్యువాత పడటంతో సుమారు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లడంతో కన్నీరు మున్నీరయ్యాడు.

జిల్లాలో ఒకప్పుడు డాలర్ పంటగా పిలవబడే ఆక్వా సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఒకపక్క నాణ్యమైన సీడ్ లభించకపోవడం, ఫీడ్ ధరలు అధికంగా ఉండటం, విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచడం వంటి సమస్యలతో సతమతమవుతున్న ఆక్వా రైతాంగానికి ఊహించని రీతిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల దాడితో పరిస్థితి తలకిందులైంది. ఈ నేపథ్యంలోనే ఆక్వా చెరువులపై వైరస్ దాడి ప్రారంభించింది. దీంతో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. దీనిలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. దీనిపై వేలాది మంది ఆక్వా రైతులు, ఆక్వా అనుబంధ పరిశ్రమల కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆక్వా సాగుకు గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. ఆక్వా చెరువులపై వివిధ రకాల వైరస్‌లు దాడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని అడ్డుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. అయినా పరిస్థితులు అదుపులోకి వచ్చే పరిస్థితి కనిపించట్లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఆక్వా చెరువులను విబ్రో, వైట్ స్పాట్ వైరస్ చుట్టుముట్టాయి. దీనికి తోడు ఫీడ్ అధికంగా వినియోగించడం, సీడ్ నాణ్యత లేకపోవడం, వాతావరణ మార్పులు, సాగుకు సాగుకు మధ్య సమయం ఇవ్వకపోవడం, చెరువులకు మురుగు బోదె లేకపోవడం వంటి వాటి వల్ల కూడా వైరస్ సమస్య మరింత పెరుగుతోంది. సాగుకు సాగుకు మధ్య కనీసం నెల రోజులు గడువు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ రైతులు పట్టుబడి పట్టిన వెంటనే మళ్లీ సీడ్ వేయడంతో వైరస్ ప్రబలుతోంది. సాధారణంగా ఒక ఎకరానికి 90 వేల నుంచి లక్ష వరకు రొయ్య పిల్లలు వేయాల్సి ఉంది. అయితే కొంతమంది రైతులు లక్షా 50 వేల నుంచి రెండు లక్షలు, మూడు లక్షలు వరకూ రొయ్య పిల్లలు వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల కూడా వైరస్ సోకుతుందని కొంతమంది రైతులు చెబుతున్నారు. ప్రధానంగా వైట్ కట్ , విబ్రో వైరస్‌లు ఆక్వా చెరువులను చుట్టుముట్టాయి. పక్షులు, పాములు, కప్పలు, కుక్కల ద్వారా చెరువులకు ఈ వైరస్ సోకుతోంది. చివరకు గాలి ద్వారా కూడా ఒక చెరువు నుంచి మరో చెరువుకు వైరస్ సోకుతుండటంతో రైతులు అర్థాంతరంగా చెరువులు పట్టుబడులు పట్టి అయినకాడికి అమ్ముకుంటున్నారు. నెల రోజుల్లో వైరస్ ప్రభావంతో 70 శాతం చెరువులు ఖాళీ అయ్యాయి. రైతులు సాగు చేయకుండా అలాగే వదిలేశారు. ఈ నేపథ్యంలో సాగు చేయాలా.. వద్దా అనే సందిగ్ధ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

సాగు వాయిదా దిశగా రైతులు

పాలకోడేరు మండలంలో వేంద్ర, మోగల్లు, కొండేపూడి, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షం గ్రామాల్లోని ఆక్వా చెరువులు వైరస్ ప్రభావానికి గురయ్యాయి. దీంతో అయినకాడికి పట్టుబడులు పట్టి ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు తీవ్రంగా నష్టపోయారు. దీంతో సాగు చేయకుండా చెరువులను ఖాళీగా ఉంచారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలోని రైతులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఆక్వా సాగును కొన్ని రోజులపాటు వాయిదా వేసేందుకు నిర్ణయించుకున్నారు. వైరస్ ప్రభావం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆక్వా రైతులు చెబుతున్నారు.

అయినకాడికి రైతులు పట్టుబడి

ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నష్టం

నెల రోజుల వ్యవధిలో 70 శాతం చెరువులు ఖాళీ

దిక్కుతోచని స్థితిలో ఆక్వా రైతులు

రొయ్యలకు మద్దతు ధర ప్రకటించాలి

పాలా శ్రీనివాసరావు, ఆక్వా రైతు, వేంద్ర

నేను రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తున్నాను. మా ప్రాంత ఆయకట్టు వైరస్ ప్రభావానికి గురవ్వడంతో పట్టుబడి ముందుగానే పట్టేశాను. నాణ్యమైన సీడ్ దొరకడం లేదు. ఫీడ్ ధరలు అధికంగా ఉన్నాయి. ధరలపై నియంత్రణ కూడా లేదు. పట్టుబడులు ఎక్కువ ఉన్నప్పుడు ధరలను అమాంతం తగ్గించేస్తున్నారు. దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. రొయ్యలకు కనీస మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలి.

45 రోజుల్లోనే పట్టుబడి పట్టేశాను

కడలి మణికంఠ, ఆక్వా రైతు, వేంద్ర

మూడున్నర ఎకరాల్లో సాగు చేస్తున్నాను. సాధారణంగా పంట చేతికి రావాలంటే 90 రోజులు సమయం పడుతుంది. అయితే ప్రస్తుతం వైట్‌కట్, విబ్రో వైరస్‌లు చెరువులను చుట్టుముట్టడంతో సీడ్ వేసిన 45 రోజుల్లోనే పట్టుబడి పట్టేశాను. ప్రస్తుతం ట్రంప్ విధించిన సుంకాలతో ధరలు తగ్గిపోయాయి. ఓపక్క వైరస్ ప్రభావం, మరోపక్క ధరలు తగ్గిపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

ప్రమాదకరంగా వంతెనలు.. వణుకుతున్న ప్రజలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో పలు ప్రధాన కాలువలపై నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. ఈ వంతెనలు దశాబ్దాలుగా ప్రభుత్వ యంత్రాంగంలో నిర్లక్ష్యం వేళ్లూనుకుపోవడంతో వీటి గురించి పట్టించుకునే వారు లేరు. వంతెనలపై పలు చోట్ల రక్షణ గోడలు కూలి, మరికొన్ని వంతెనలు ఇరుకుగా ఉండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. మండలంలోని శ్రీహరిపురం, ఉప్పరగూడెం, గ్రామాల్లోని వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. రక్షణ గోడలు లేకుండా అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ వంతెనలు శిథిలావస్థకు చేరడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకునే ముప్పు పొంచి ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రమాదకరంగా శ్రీహరిపురం వంతెన

రక్షణ గోడలు లేవు

శ్రీహరిపురం సీబీ కెనాల్‌పై వంతెనకు, ఉప్పరగూడెం వద్ద పెదలంక డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు రక్షణ గోడలు లేవు. కనీస నిర్వహణ లేకపోవడంతో ఇక్కడ పరిస్థితి ప్రమాదకరంగా మారింది. భీమవరం నుంచి విజయవాడ ఇతర పట్టణాలకు వెళ్లాలంటే శ్రీహరిపురం సిబి కెనాల్ వంతెనపై నుంచి వాహన రాకపోకలు సాగుతున్నాయి. ఈ వంతెన రక్షణ గోడలు కూలిపోయాయి. వంతెన పిల్లర్లపై మొక్కలు పెరిగిపోయాయి. ఈ మార్గంలో నిత్యం వందల బస్సులు, లారీలు, ఆటోలు, వేల సంఖ్యలో ద్విచక్ర, సరకు రవాణా వాహనాలు తిరుగుతుంటాయి. రాత్రి వేళ కూడా వాహనాలు తిరుగుతుంటాయి. శిథిల వంతెనను గుర్తించేలా కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో కొంత కాలంగా ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఆక్వా సాగు అధికం

ఈ ప్రాంతంలో వరితో పాటు ఆక్వా సాగు అధిక విస్తీర్ణంలో సాగవుతుంది. దీనికి తోడు మండలంలో ఆక్వా ఆధారిత పరిశ్రమలున్నాయి. ఆక్వాకు సంబంధించిన చేప, రొయ్య మేత లారీలు అధిక లోడుతో నిత్యం వెళ్తుంటాయి. శిథిల వంతెనలపై ప్రయాణిస్తే ఏం జరుగుతుందో చెప్పలేమని రైతులు అంటున్నారు.

ఉప్పరగూడెం వద్ద పెదలంక వంతెనకు రక్షణ గోడలు శిథిలావస్థకు చేరాయి. ఈ వంతెనపై రోడ్డు ఇరుకుగా ఉంది. రెండు వాహనాలు తప్పుకునే అవకాశం లేదు. వంతెనపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీనికి తోడు రోడ్డు పనుల్లో నాణ్యత లేకపోవడం, భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. నిత్యం ఈ వంతెన గుండా కృష్ణా జిల్లా ముఖ్య పట్టణం మచిలీపట్నం వెళ్లేందుకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు మరింత శిథిలావస్థకు చేరింది. రహదారిపై గోతులు పడి ప్రమాదంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు.

ఆ వంతెనలు ఏళ్ల నాటివి

నిర్వహణ లేక రక్షణ గోడలు దెబ్బతిని తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎప్పుడు కూలుతాయో తెలియక వాహనదారులు వాటి వద్దకు వచ్చేసరికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈ వంతెనలు కూలకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


అవార్డు అందుకుంటున్న గోపాలకృష్ణ

గోపాలకృష్ణకు రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి - చింతలపూడి

ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలోని కెఎల్‌యు యూనివర్సిటీలో ఈ నెల 27వ తేదీన జరిగిన కిసాన్ మహోత్సవం 2025లో కిసాన్ అంగడి వ్యవస్థాపకుడు లిమరికంటి గోపాలకృష్ణ ఉత్తమ రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విస్తరణ నిపుణుల అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ ఎంఎల్‌సి సోము వీర్రాజు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గత ఏనిమిదేళ్లుగా గోపాలకృష్ణ ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కిసాన్ అంగడి ద్వారా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ, సోషల్ మీడియా, డిజిటల్ క్లాసులు, విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రమాణీకరణ పత్రాలను కూడా అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ ఐదు రిసోర్స్ సెంటర్ ద్వారా రైతు సహాయాలు, ద్రావణాలు తయారు చేసి రైతులకు అందిస్తూ శిక్షణ తరగతులు నిర్వహిస్తూ రైతుల్లో విశ్వాసాన్ని నింపుతున్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ అవార్డు తనకు రావడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, సిబ్బంది

ఆర్చరీ పోటీల్లో చింతలపూడి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో పురుషులు, మహిళల విభాగాల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల ఆర్చరీ పోటీలు ఈ నెల 26వ తేదీన నిర్వహించారు. రెండు విభాగాల్లోను ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడి విద్యార్థులు విజేతలుగా నిలిచారు. తదుపరి జరిగిన యూనివర్సిటీ టీమ్ ఎంపికలో ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు యూనివర్సిటీ ఆర్చరీ జట్టుకు ఎంపికయ్యారు. ఈ పోటీల్ల విద్యార్థులు తమ ఏకాగ్రత, క్రమశిక్షణ, శారీరక చురుకుదనం, క్రీడాస్ఫూర్తిని ప్రతిభావంతంగా ప్రదర్శించారు. ఈ విజయంతో విద్యాసంస్థకు గౌరవం తీసుకువచ్చిన విద్యార్థులను అభినందించారు. అనంతరం కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా.అంజద్ ఆలీ మాట్లాడుతూ ఎంపికైన యూనివర్సిటీ జట్టు గురుకాసి యూనివర్సిటీ పంజాబ్‌లో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఈ విజయానికి విద్యార్థుల కృషి, క్రీడా శిక్షకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని చెప్పారు. విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో విజయాలు సాధించాలని కళాశాల అధ్యాపకులు ఆకాంక్షిస్తూ, అభినందనలు తెలిపారు.

జిఎస్‌టిపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ముసునూరు

జిఎస్‌టిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరులో జిఎస్‌టిపై ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 28 శాతం ఉన్న జిఎస్‌టి, నేడు ఐదు శాతానికి తగ్గించినట్లు చెప్పారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మానవత సభ్యులు

ఆపన్నులకు అండగా 'మానవత'

ప్రజాశక్తి - మండవల్లి

సేవ చేయడంలో మానవత సంస్థ ముందుంటుందని ఆ సంస్థ మండలాధ్యక్షులు కోనపరెడ్డి బాల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని లింగాలలో మానవత సంస్థ నెలాఖరు సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణా జిల్లా కెరీర్ గైడెన్స్ చైర్మన్, ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి మానవత స్వచ్ఛంద సంస్థ స్పందించి తనవంతు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. సెప్టెంబర్‌లో అందించిన సేవా కార్యక్రమాలపై చర్చించి పేదలకు నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 148 మంది స్వచ్ఛంద సంస్థలో చేరే విధంగా సభ్యత్వాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోయిడి సురేష్, వరద శ్యామ్, మొలపూడి సత్తిబాబు, బొమ్మన బోయిన గోకర్ణ, యాదవ్, కిన్ని బాబు, గంజాల శ్రీనివాసరావు బుద్ధల రాముడు వేల్లపూడి కాగితపు సూర్యనారాయణ, కాసుగని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ట్రక్కు ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ట్రక్కు ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన నారాయణపురం ఉండి ఆర్‌అండ్‌బి రహదారిలో రాచూరు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. దెందులూరు మండలం సింగవరం గ్రామానికి చెందిన మానవరపు సింహాచలం, ఆమె కుమారుడు పోతురాజు కలిసి మోటార్ సైకిల్‌పై పత్తేపురం బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో రాచూరు వద్ద ట్రక్కు ఆటో అదుపుతప్పి మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న మానవరపు సింహాచలం (59) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు మానవరపు పోతురాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు ఎస్ఐ మామిడాల సూర్య భగవాన్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ముదినేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షాహిన్షా బేగ్ గుడివాడలో తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. ముదినేపల్లి ఆటో నగర్‌లో ఎలక్ట్రికల్ వర్క్ చేస్తుంటాడు. ఈ నెల 25వ తేదీ గురువారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో బైక్‌పై గుడివాడ బయలుదేరాడు. ఈ క్రమంలో బైక్ ముదినేపల్లి ఊరి చివర పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి గుడివాడ నుంచి ఎదురుగా అతివేగంగా, నిర్లక్ష్యంగా, హారను కొట్టకుండా వచ్చిన లారీ షాహిన్షాబేగ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన షాహిన్షా బేగ్‌ను 108లో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆదివారం వచ్చిన రిపోర్టుపై ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మద్యం తాగి వాహనాలు నడపొద్దు
మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగనాయకులు

చిట్ చాట్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వాహనదారులందరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగనాయకులు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని పలు సూచనలు చేశారు. ఆయనతో ప్రజాశక్తి చిట్‌చాట్..

ప్రశ్న : మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా మీ బాధ్యతలు ఏమిటి?

ఎంవిఐ : వాహనాల ఫిట్‌నెస్ చెక్ చేయడం, డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షలు నిర్వహించడం, ట్రాఫిక్ రూల్స్ అమలు చేయడం మా ప్రధాన బాధ్యతలు.

ప్రశ్న : రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఎంవిఐ : అవగాహనా కార్యక్రమాలు, రెగ్యులర్ వాహన ఫిట్‌నెస్ టెస్టులు, ట్రాఫిక్ చెకింగ్ ద్వారా ప్రజల్లో క్రమశిక్షణ పెంచుతున్నాం.

పశ్న : డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడానికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి

ఎంవిఐ : సరైన పత్రాలు సమర్పించడం, ట్రాఫిక్ రూల్స్ బాగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

ప్రశ్న : వాహన యజమానులు ఎక్కువగా ఎలాంటి తప్పులు చేస్తున్నారు?

ఎంవిఐ : ఇన్సూరెన్స్ లేకపోవడం, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేకుండా వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉపయోగించకపోవడం వంటివి ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ప్రశ్న : ఎలక్ట్రిక్ వాహనాల పెరుగుదలతో ఎలాంటి మార్పులు వచ్చాయి?

ఎంవిఐ : కొత్త వాహన టెక్నాలజీకి అనుగుణంగా చెక్‌లిస్టులు మారుతున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల సేఫ్టీ టెస్టింగ్ కూడా జరుగుతోంది.

ప్రశ్న : పిల్లల రవాణా (స్కూల్ బస్సులు, ఆటోలు) విషయంలో ఏ నియమాలు పాటించాలి?

ఎంవిఐ : డ్రైవర్‌కు సరైన లైసెన్స్ తప్పనిసరి. బస్సుల్లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ డోర్ ఉండాలి. ఓవర్‌లోడింగ్ చేయరాదు.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో ప్రజల పాత్ర ఏమిటి? ఎంవిఐ : హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి. మద్యం తాగి డ్రైవింగ్ చేయకూడదు. ట్రాఫిక్ రూల్స్ గౌరవిస్తే ప్రమాదాలు 70 శాతం తగ్గుతాయి.

ప్రశ్న : వేగంగా డ్రైవ్ చేస్తున్న యువతకు మీరు ఏ సందేశం ఇస్తారు?

ఎంవిఐ : వేగం జీవితాన్ని దూరం చేస్తుంది. ఆరోగ్యం, భవిష్యత్తు, కుటుంబం కోసం క్రమశిక్షణతో వాహనం నడపాలి.

ప్రశ్న : వాహనదారులకు మీరిచ్చే సందేశం ఏమిటి?

ఎంవిఐ : తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. వాహనదారులందరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలి. సంతోషంగా గమ్యం చేరాలి.

ఘనంగా జాషువా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆధునిక కవితా పితామహులు, కవి కోకిల, కవితా విశారద, కవిదిగ్గజ, నవయుగకవి చక్రవర్తి, పద్మ భూషణ్ గుర్రం జాషువా 130వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా కె.ప్రభాకర్ సెట్‌వెల్ సిఇఒ ముఖ్య అతిథిగా హాజరై గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నగర ప్రముఖులు, సామాజిక కార్యకర్త, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అభివీద్ధి కమిటీ అధ్యక్షులు మేతర అజయ్‌బాబు, సామాజిక కార్యకర్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, సామాజిక కార్యకర్తలు, పి.తంబి, డొమినిక్, రెడ్డిబాబు, గణేష్, నరసింహారావు, మిల్టన్, విటి.సందీప్‌కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం :అమరావతిలో గుర్రం జాషువా విగ్రహం ఏర్పాటు చేయటంతో పాటు ఆయన జన్మించిన గుంటూరు జిల్లా వినుకొండలో స్మారక మందిరం నిర్మించాలని బిసి చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెలగల దుర్గారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన గుర్రం జాషువా 150వ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన తరగతుల ఆత్మగౌరవ జ్యోతిని వెలిగించిన అరుణతార జాషువా అన్నారు. కుల రహిత సమాజం కోసం నిరంతరం తన రచనల ద్వారా కృషి చేశారని తెలిపారు. నేటి యువత ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు మేకల అన్నవరం, సిపిఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, టీచర్ రాయపూడి రమణ, సచివాలయ డిజిటల్ ఆపరేటర్ ప్రతాప్, చిటికెన బాలగంగాధర్ తిలక్, జవ్వాది శ్రీను, పంది శ్రీను, సూరి గంగాధర్, రాజు, దాసరోజి శేఖర్, గ్రంథాలయ అటెండర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలూరులో...

ఎఎంసి చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న చంద్రశేఖర్

ఎఎంసి చైర్‌పర్సన్‌కు సత్కారం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎఎంసి చైర్‌పర్సన్ చీదరాల దుర్గాపార్వతిని, ఆమె భర్త చీదరాల మధుబాబును వారి నివాసంలో ఎర్రంపల్లి సొసైటీ చైర్మన్ తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి (చిన్నబాబు) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు.

లారీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా రాంబాబు, వలీపాషా

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

లారీ యూనియన్ మండలాధ్యక్షులుగా గంజి రాంబాబు, కార్యదర్శిగా మహమ్మద్ వలీపాషాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సిఐటియు మండల కన్వీనర్ యర్సం సాయికిరణ్ తెలిపారు. ది లారీ, మినీ వ్యాన్, టాటా ఎసి బొలెరో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ సిఐటియు సమావేశం నిర్మల వెంకటేశ్వరరావు అధ్యక్షతన లారీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ, రవాణా రంగం, డ్రైవర్లు ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివారన్నారు. వారు సరుకులు ఒక చోట నుంచి మరొక చోటుకు చేరవేస్తారని, కాని వారికి తగిన భద్రత, విశ్రాంతి, వేతనం, గౌరవం అందక అనేక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా యర్సం సాయికిరణ్, అధ్యక్షులుగా గంజి రాంబాబు, కార్యదర్శిగా మహమ్మద్ వలీపాషా, కోశాధికారిగా ఓగిరాల నాగరాజు, ఉపాధ్యక్షులుగా కొప్పెర శ్రీను, మహేష్, సహాయ కార్యదర్శులుగా నిర్మల వెంకటేశ్వరరావు, విశ్వేశ్వరరావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో నాగరాజు, సంజెయ్ పాల్గొన్నారు.

గాంధీ స్కూల్ చైర్మన్లు, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అగ్రహారంలో ఉన్న గాంధీ స్కూల్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం మహోత్సవం ఆదివారం గాంధీ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ బడేటి చంటి, విజయవాడ ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హాజరయ్యారు. ముందుగా ఎంఎల్‌ఎ బడేటి చంటి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చైర్మన్‌గా నియమితులైన జెన్యావుల అంజిబాబు, పదిమంది డైరెక్టర్లచే ఎంఎల్‌ఎ బడేటి చంటి ప్రమాణస్వీకారం చేయించారు. నియామకమైన చైర్మన్, డైరెక్టర్లను ఎంఎల్‌ఎ చంటి, రెడ్డి అప్పలనాయుడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ గాంధీ పాఠశాల అనేది మహా విశ్వవిద్యాలయమన్నారు. చైర్మన్లు, డైరెక్టర్లుగా నియమితులైన వారు కలిసికట్టుగా పనిచేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తాను ఎటువంటి సహకారం అయినా అందిస్తామని హామీ ఇచ్చారు. రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ గాంధీ విశ్వవిద్యాలయానికి 104 ఏళ్ల చరిత్ర ఉందని, ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఎఎస్ లు అయ్యారని అన్నారు. పాఠశాల అభివృద్ధికి సభ్యులందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇడా చైర్మన్ శివప్రసాద్, ఎఎంసి చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, టిడిపి నగర ప్రెసిడెంట్ చోడే వెంకటరత్నం, పూర్వ విద్యార్థులు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మేయర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- ఏలూరు సిటీ

ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పవర్‌పేట మేయర్ క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య హాజరై మేయర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఇడా చైర్మన్ పెద్దబోయిన శివప్రసాద్, ఎఎంసి చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఏలూరు పట్టణ అధ్యక్షులు చోడే వెంకటరత్నం, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు హాజరై పూల బొకేలు ఇచ్చి మేయర్ నూర్జహాన్ పెదబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మేయర్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు తొలుత పవర్‌పేట వాసు దేవాలయంలో, శివాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడ నుంచి మోటార్ సైకిల్ ర్యాలీగా బయలుదేరి మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్రూట్స్ గజమాలను స్వీకరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, ఇంజొనీరింగ్ సెక్షన్ సిబ్బంది, మున్సిపల్ ఆఫీస్ అటెండర్లు డ్రైవర్లు, మున్సిపల్ స్కూల్స్ స్వీపర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, తదితర 2500 మందికి మేయర్ నూతన వస్త్రాలను అందించారు. పవర్‌పేటలోని ఎస్ఎంఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపును మేయర్ ప్రారంభించారు.


కేక్ కట్ చేస్తున్న మేయర్ నూర్జహాన్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 29వ తేదీ సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆర్‌డిఎస్ఎస్ వర్క్స నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం సీతానగరం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న సీతానగరం, అల్లిపల్లి, ఊటసముద్రం, ఆర్‌పి కండ్రిక, రేచర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని యర్రగుంటపల్లి, మెతుకుమెల్లివారిగూడెం, శంఖుచక్రపురం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి సత్యసాయి ఫీడర్, 11 కెవి తిమ్మిరెడ్డిపల్లి ఫీడర్ల పరిధిలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

సమన్వయంతో అభివృద్ధిపై దృష్టి సారించాలి

కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్

ప్రజాశక్తి - ముదినేపల్లి

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు సమన్వయం చేసుకుంటూ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వాడవల్లి గ్రామంలో ఆదివారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. తొలుత బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్‌ఎ శ్రీనివాస్ పూలమాల వేశారు. అనంతరం డ్వాక్రా మహిళలకు తక్కువ వడ్డీ రుణం చెక్కులను, రైతు నేస్తం, కర్షక మిత్ర రుణం చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాలాభివృద్ధి చెందాలన్నారు. నిధులు తేవడం తన బాధ్యత, అభివృద్ధి చేయటం మీ బాధ్యత అని అన్నారు. ఇప్పటికే 90 శాతం సీసీ రోడ్లు పూర్తి చేశామని, మిగిలిన వాటిని త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి విఠల్‌రావు, టిడిపి నాయకులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, వీరంకి వెంకయ్య, ఎఎన్.బాబు, నానాజీ, సొసైటీ చైర్మన్ ఎం.గోవర్ధన్‌రావు, సిఇఒ కె.నాగమునీంద్రరావు, గ్రామ సర్పంచి సుధాబత్తుల రమణ, పలు గ్రామాల పిఎసిఎస్ చైర్మన్లు, సిఇఒలు, ప్రజాప్రతినిధులు, రైతులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ శ్రీనివాస్

నూజివీడులో ఎగ్జిబిషన్ ప్రారంభం

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఎగ్జిబిషన్‌ను నిర్వాహకులు శనివారం రాత్రి నూజివీడు పట్టణ ప్రముఖులచే రిబ్బన్ కట్ చేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈసారి ఎగ్జిబిషన్‌లో కాశ్మీర్ అందాలను చూపించే విధంగా ఎంట్రీ సెట్‌ను వేశామని, వినోదాన్ని పంచడానికి జెయింట్ వీల్ కొలంబస్ బ్రేక్ డాన్స్, పిల్లలను, పెద్దలను అలరింపచేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎన్నో రకాల ఫుడ్ స్టాల్స్‌తో ప్రారంభించినట్లు చెప్పారు. ఎగ్జిబిషన్‌ను నూజివీడు పట్టణ కౌన్సిలర్లు యార్లగడ్డ ప్రసాద్, దుర్గాప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్, టిడిపి సీనియర్ నాయకులు విజయ్ ప్రారంభించారు.

మొరాయించిన పోలీస్ జీప్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి పోలీసుస్టేషన్ జీప్ మొరాయించడంతో పోలీసులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఉదయం పోలీస్ జీప్ సాంకేతిక లోపంతో ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో పోలీసులు స్థానికుల సహాయం కొరగా ప్రజలు వాహనాన్ని వెనుక నుంచి నెట్టి స్టార్ట్ చేశారు. పాత వాహనాలను మార్చి కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు సూచించారు.

జీపును తోస్తున్న పోలీసులు, విద్యార్థులు

కాలినడక యాత్రికులకు అల్పాహార స్టాల్

ప్రజాశక్తి - భీమడోలు

సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా జాతీయ రహదారిపై భీమడోలు సమీపంలో దసరా సందర్భంగా విజయవాడకు కాలినడక తరలి వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన అల్పాహార స్టాల్ సేవలను వినియోగించుకోవాలని శ్రీ సత్యసాయి సేవా సమితి భీమడోలు, గుండుగొలను శాఖలు కోరాయి. రాజమండ్రి, గుండుగొలను, ఏలూరు మీదుగా విజయవాడకు జాతీయ రహదారి ద్వారా దూర ప్రాంతాలకు చెందిన, ఇతర జిల్లాలకు చెందిన యాత్రికులు పలువురు కాలినడకన విజయవాడకు వెళ్తుంటారు. వీరి సౌకర్యార్థం శ్రీ సత్యసాయి సేవా సమితి వారు భీమడోలు వద్ద అల్పాహారం స్టాల్ ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు స్టాల్‌ను కొనసాగించనున్నట్లు తెలిపారు. ఇదే నేపథ్యంలో యాత్రికులకు వాటర్ బాటిల్స్ అందిస్తున్నారు. యాత్రికులు స్నానాలు, ఇతర అవసరాలను తీర్చుకునేందుకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. యాత్రికులు సేద తీరేందుకు అవసరమైన ఏర్పాట్లను చేసినట్లు నిర్వాహక కమిటీ సభ్యులు, శ్రీ సత్యసాయి సేవా సమితి జిల్లా మెడికల్ కోఆర్డినేటర్ కెఎల్ఎన్.మూర్తి, భీమడోలు శాఖ కన్వీనర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు (సత్యసాయి), చంద్రకుమార్, బాదర్వాడ కుసుమ, పుష్ప తెలిపారు.

రోడ్లు అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని టి.నరసాపురం పంచాయతీలోని గండిగూడెం వెళ్లే రోడ్లతో పాటు గ్రామంలో రోడ్లు అభివృద్ధి చేసి డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయాలని సామాజిక కార్యకర్త ఎస్‌డి.నాసర్‌పాషా ప్రభుత్వాన్ని కోరారు. గండిగూడెం గ్రామంలో స్థానికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా గండిగూడెం గ్రామానికి చెందిన రోడ్లు ఎవరూ పట్టించుకోకపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యానికి టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, ఏలూరు, చింతలపూడి అంబులెన్స్ సైతం సకాలంలో వెళ్లే పరిస్థితి లేదన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగు నీటి నిల్వతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గండిగూడెం రోడ్లకు మోక్షం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద కొరివి శేషారావు, సామాజిక కార్యకర్తలు కొరివి నాగేశ్వరరావు, పొదిల రామారావు, గ్రామస్తులు బడుగు రాఘవులు, సత్తెనపల్లి నరసయ్య, యాదాల వెంకన్న, చక్రాల నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా దసరా మహోత్సవాలు

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి మండలంలో దసరా మహోత్సవాలను ఆలయ కమిటీ, గ్రామస్తులు ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. పెరికేగూడెం, శ్రీరామ్ నగర్ కానుకొల్లు, లింగాల, చింతపండు, కొవ్వాడ లంక తదితర గ్రామాల్లోని దేవాలయాలు యాత్రికులతో కిటకిటలాడుతున్నాయి. మండవల్లి శివాలయంలో ఇఒ కొవ్వాడ దివ్య, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజలను ఎంతో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మండవల్లిలో భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి జై శ్రీ నాట్యమండలి కొడాలి వీరాంజనేయులు ఆశీస్సులతో కుమారుడు కొడాలి రాజా ఆధ్వర్యంలో పూలరంగడు అనే హాస్య భరిత నాటకాన్ని ప్రదర్శించారు.

వైసిపి డిజిటల్ బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం క్యూఆర్ కోడ్ డిజిటల్ బుక్ పోస్టర్‌ను నూజివీడు మాజీ ఎంఎల్‌ఎ ప్రతాప్ అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నేతలను ఇబ్బంది పెట్టే వారి పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసే వీలుంటుందని తెలిపారు. దాడులు, దౌర్జన్యాలు చేసే వారి పేర్లు అందులో నమోదు చేయాలన్నారు. ఈ ఫిర్యాదులన్నిటిపై వైసిపి అధికారంలోకొచ్చాక కచ్చితంగా విచారణ ఉంటుందని తెలిపారు. అన్యాయం చేసిన వారు ఎక్కడున్నా సరే తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైసిపి కార్యకర్తలను కాపాడుకోవటం కోసం జగన్ డిజిటల్ బుక్ ప్రవేశపెట్టారని తెలిపారు.

పోలవరం :వైసిపి కార్యకర్తలకు ఎక్కడ అన్యాయం జరిగిన అండగా ఉంటామని, భరోసా కల్పిస్తామని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బుగ్గ మురళీకృష్ణ అన్నారు. వైసిపి డిజిటల్ బుక్ కార్యక్రమాన్నిస్థానిక ఏటిగట్టు సెంటర్‌లో పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు కలుమ్ హేమకుమారి, సీనియర్ నాయకులు సొబ్బన మోహన్, మైగాపుల దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బుగ్గ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులకు, సామాన్యులకు అందేటట్లుగా చేయటానికి ఉద్యమించాలన్నారు. పార్టీ అధికారంలోకొచ్చిన వెంటనే కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని కార్యకర్తలకు జగన్ భరోసా ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి కొరసాక శ్రీనివాసు, కులపర్తి ధర్మరాజు, వర్మ, గొంతు శివ, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, దేవాదాయ ధర్మదాయ శాఖ, ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, చేబ్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణీ సమేత పాండురంగస్వామి దేవస్థానము, చేబ్రోలు, ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్ మరియు హిందూ రెలిజియన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎండోమెంట్ చట్టం సెక్షన్ 30/1987 ప్రకారం ప్రచురణ, రిజిస్ట్రేషన్ చేయుట కొరకు ప్రతిపాదించడమైనది. కావున సదరు సంస్థను ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్ మరియు హిందూ రెలిజియన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎండోమెంట్ చట్ట ప్రకారం ప్రచురణ మరియు రిజిస్ట్రేషన్ చేయుటలో ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన తేదికి 10 రోజులలో లిఖిత పూర్వకముగా శ్రీయుత జిల్లా ఎండోమెంట్స్ అధికారి, దేవదాయ ధర్మదాయ శాఖ ఏలూరు వారి కార్యాలయం వారికి తెలుపగలరని తెలియజేయడమైనది.

సం/- చైర్మన్
శ్రీ రుక్మిణీ సమేత పాండురంగస్వామి దేవస్థానము
చేబ్రోలు

చేబ్రోలు
ది. 28-09-2025